జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


బుధవారం | 26-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 259 పేజీలు: 4 వెల : రూ.7



# అమ్మకానికి.. ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్.. స్థలం

*** ఆర్మీ ఉద్యోగికి కట్టబెట్టిన మున్సిపాలిటీ * కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ దొడ్డిదారిలో షాపు నిర్మాణం * చేతులు మారిన రూ.50వేలు * బోనస్‌గా ఆర్మీ బాటిళ్లు * ఈ షాప్‌కి అరగంటలో విద్యుత్ మీటర్ * రాత్రికి రాత్రే వెలసిన అక్రమ షాప్**

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 25 (వార్త): ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో డైలీ మార్కెట్ ఎదురుగా ఉన్న ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ (పాత సూపర్ బజార్)లో హ్యాపీగా ఒక షాపును అనధికారికంగా కట్టించి కట్టబెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా మెట్ల కింద షాపు మాదిరిగా తయారుచేసి విధి నిర్వహణలో ఉన్న ఆర్మీ ఉద్యోగికి కట్టబెట్టిన వైనం మార్కెట్లో సంచలనం రేకెత్తించింది. రాత్రికి రాత్రే అక్కడ షాపు వెలిసింది. దీనికి తోడు కరెంటు మీటర్ కూడా గంటలోనే రావడం విశేషం. దీని వెనుక పెద్ద ఎత్తున తతంగం నడిచినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ చెందిన పెద్ద తలకాయలకు చెరో పాతికవేలు చొప్పున చేతులు మారినట్లు సమాచారం. అలాగే బోనస్‌గా ఆర్మీ మద్యం బాటిళ్లు కూడా ముట్టచెప్పినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న డైలీ మార్కెట్ వర్తకులు, వ్యాపారులు, దినసరి కూలీలు గొల్లుమంటున్నారు. తాము కూరగాయలు నిల్వ ఉంచుకుంటామని మెట్ల కింద అవకాశం ఇవ్వమంటే ఇవ్వకుండా ఆర్మీలో పనిచేస్తున్న వ్యక్తికి షాపు ఎలా కట్టేసి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఐడిఎస్ఎమ్‌టి పథకం కింద ఎనిమిది షాపులు నిర్మించారు. ఇందులో నిబంధనలు పాటించలేదని కోర్టుకు ఎక్కడంతో నాలుగు షాపులు 20 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. పైన ఉన్న నాలుగు షాపులు మాత్రమే వాడుతున్నారు. అందులో కూడా ఒక షాపునకు చెందిన వ్యక్తి మృతి చెందడంతో ఆ షాపు కూడా మూసివేశారు. మునిసిపాలిటీకి ఆదాయం రాకుండా షాపులు అలానే ఉన్నాయి. మొదటి షాపులో పక్కన ఎన్టీఆర్ సుజలధార కింద రెండు రూపాయల నీరు పంపిణీ కోసం కేటాయించారు. చివరిషాపు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సులభ్ కాంప్లెక్స్ కోసం రోటరీ క్లబ్‌కి కేటాయించారు. మధ్యలో ఉన్న మెట్లు కింద ఏకంగా ఒక షాపునే నిర్మించారు. మున్సిపాలిటీలో షాపు దక్కాలంటే చాలా పెద్ద వ్యవహారం ఉంటుంది. ఇదేదీ కాదని ఏకంగా తమ సొంత ఆస్తి అమ్మినట్లు పట్టా రాసిచ్చేయడంపై స్థానికుల ధ్వజమెత్తుతున్నారు. ఎవరైనా ఒక ఇంటికి గానీ, షాపుకు గాని కరెంటు మీటర్ కావాలంటే వంద నిబంధనలు చెబుతారు. అటువంటిది ఆక్రమించి నిర్మించిన షాపునకు ఏకంగా కరెంటు మీటర్‌ను గంటల వ్యవధిలో పెట్టేశారు. ఆర్మీలో పనిచేస్తున్న ఉద్యోగికి ఆక్రమణలతో పనేంటి? అతనికి సహకరించిన ఆ రెండు తలకాయలు ఎవరివి? అన్న ప్రశ్నలు అందరిలోనూ మెదులుతోంది. అలాగే ఎర్ర చెరువు గట్టుపై మరో ఆక్రమణకు కూడ సిద్ధపడుతున్నట్టు తెలిసింది.







ఆక్రమణలు అడ్డుకోవాల్సిన వారే సహకరిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని, పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారివుంటుందని, అందుకే అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తోంది.

# మాపై ఆరోపణలు.. నిజం కాదు



*** రుజువు చేస్తే ఎటువంటి శిక్షకైనా సిద్ధం * తాను ఏడాదిన్నరగా వేటకు వెళ్లలేదు * తమ విడుదలకు అన్ని పార్టీలు సహకరించాయి * మత్స్యకారుడు గణగళ్ల రామారావు దంపతుల ఆవేదన**

శ్రీకాకుళం, ఫిబ్రవరి 25 (వార్త): గతంలో తనతో పాటు పాకిస్తాన్ కోస్ట్ గార్డు పోలీసులకు బందీగా దొరికిన తోటి మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులు మాపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకారుడు గణగళ్ల రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఎన్‌జీవో హెూంలో రామారావు దంపతులు సోమవారం మీడియాతో మాట్లాడారు. తాను తండేల్ కాదంటున్నారు సరే.. మరి తన వెనుక ఎందుకు రెండు బోట్లలో మిగిలిన వారు వచ్చారని ప్రశ్నించారు. తనకు అందరితో పాటు రూ.90వేలు మాత్రమే అందిందని, అంతకు మించి ఎటువంటి నగదు సినిమా యూనిట్ నుంచి అందలేదన్నారు. తనకు రూ.20లక్షలు ఇచ్చారని, ఇల్లు కట్టిస్తున్నారని చేస్తున్న ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని తెలిపారు. ఆరోపణలను రుజువు చేస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమని రామారావు వాపోయారు. తమ కథ కావాలని తండేల్ యూనిట్ సభ్యులు తమ అందరి మధ్యన కూర్చుని చర్చించి అడిగారని, అందుకు అందరూ అంగీకారం తెలిపారన్నారు. ఆనాడు తనను తండేల్‌గా వీరంతా అంగీకరించడంతోనే వారు సినిమాను తీశారని, ఇప్పుడు సినిమా విడుదలై హిట్ అయిన తరువాత అసలు తాను తండేలే కాదనడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. తండేల్ సినిమా షూటింగ్ ప్రారంభమైన నాటి నుంచి తనకు యూనిట్ సభ్యులు పలుమార్లు ఫోన్లు చేసి ఏం జరిగింది... ఎలా జరిగింది? అంటూ పదేపదే ఆనాటి విషయాలను అడిగేవారని చెప్పారు. దీంతో తాను ఏడాదిన్నర వేటకు కూడా వెళ్లలేదని, మరి తన కుటుంబానికి ఎలా పోషించుకునేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మిగిలిన వారు అర్థం చేసుకొని ఆరోపణలు మానుకోవాలని కోరారు. ఆనాడు అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ విడుదలకు సహకరించారని రామారావు వెల్లడించారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ పేర్కొన్నారు.శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. యువత లక్ష్య సాధనవైపు అడుగులు వేయాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్సీసీ అధికారి కెప్టెన్ వై.పోలి నాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఆర్.శ్రీనివాస పాత్రో, ఎంవీ సత్యనారాయణ పాల్గొన్నారు.




# ఐఆర్ ప్రకటించి.. బకాయిలను చెల్లించాలి

**యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు**



**మందస, ఫిబ్రవరి 25(వార్త):** పీఆర్సీ చైర్మన్‌ను నియమించి, ఐఆర్ 30శాతం ప్రకటించి, ఆర్థిక బకాయిలను చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు డిమాండ్ చేశారు. మండలంలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ , అంబేద్కర్ గురుకులం పాఠశాలలో మందస మండల యుటిఎఫ్ శాఖ కార్యకర్తలు నాలుగు బృందాలుగా ఏర్పడి సుడిగాలి పర్యటన చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఎన్నికల ప్రచారం అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంబుగాంలో సమీక్షా సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బాబురావు మాట్లాడుతూ ఈనెల 27న జరగబోవు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, యూటీఎఫ్ పక్షాన ఏజెంట్ ను నియమించాలని సూచనలు చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రాక్టు ఉపాధ్యాయ, అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేయాలని, యూనివర్శిటీ, డిగ్రీ, జూనియర్ కాలేజీలలో తక్షణం నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ జీవో 3ను పునరుద్ధరించాలని, ప్రైవేటు విద్యాసంస్థలలో ఉపాధ్యాయ, అధ్యాపకులకు, సిబ్బందికి వేతన చట్టం, హెల్త్ కార్డులు, ప్రత్యేక పెన్షన్ స్కీమ్, 200 గజాల ఇంటి స్థలం, సెలవులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి గున్న రమేష్ మాట్లాడుతూ నిబంధనలకనుగుణంగా అధ్యాపక, ఉపాధ్యాయులకు సెలవులను మంజూరు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలను ప్రారంభించాలని, ఉన్నత పాఠశాలలో పోస్టులన్నింటినీ అప్గ్రేడ్ చేయాలని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీల చట్టాన్ని రూపొందించాలి. పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్, ఏఎన్ఎంల నియామకాన్ని చేపట్టాలని, డిగ్రీ, జూనియర్ కళాశాలలో జివో 114ను అమలు చేయాలని, ప్లస్ టు పాఠశాలలను కొనసాగించి రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి తెలియజేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీల గెలుపని విజ్ఞులైన ఉపాధ్యాయ, అధ్యాపక మిత్రులు విశ్వసించాలని కోరారు. కార్యక్రమంలో మండల పూర్వపు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిన్నింటి కొండలరావు, కొర్ల సోమేశ్వంరావు, జిల్లా కౌన్సిలర్లు లండ రాజారావు, పల్లి జగన్మోహన రావు, తరణి సోమేశ్వరరావు, మండల సీపీఎస్ కన్వీనర్ దుగాన మాధవరావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు, సీనియర్ యూటీఎఫ్ కార్యకర్త సీపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## రఘువర్మకు మద్దతుగా ప్రచారం

**మందస, ఫిబ్రవరి 25(వార్త):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మందస మండలంలో పొత్తంగి-సిరిపురం, కృష్ణాపురం, చీపి గ్రామాల్లో ప్రభుత్వ హై స్కూల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం జరిగింది. రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, క్లస్టర్ ఇంచార్జి తమిరి భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగారాజు, తెలుగు యువత అధ్యక్షుడు ముడుమంచి నవీన్ కుమార్, సీనియర్ నాయకుడు బైరిశెట్టి గున్నయ్య, రాజేంద్ర పండా, బేసి ఈశ్వరరావు, కొర్రాయి సూరి, బుద్దెపు కృష్ణారావు, మురళి తదితరులు పాల్గొని, ఆయా చోట్ల వారు మాట్లాడుతూ ఎంఎల్సీ అభ్యర్థి రఘువర్మకు సీరియల్ నెంబర్ 7లో మొదటి ప్రాధాన్యత ఓటు ను వేసి గెలిపించాలని కోరారు. వారితో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బహడపల్లిలో 200మందికి వైద్య పరీక్షలు



**మందస, ఫిబ్రవరి 25(వార్త):** మందస మండలంలోని బహడపల్లిలో గాయిత్రి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొర్ల కన్నారావు, మిత్ర బృందం ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో, జెమ్స్ హాస్పిటల్ వైద్య బృందం సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 200మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన పేషెంట్స్ కు మందులు కూడా ఉచితంగా అందజేశారు. 30 మందికి అత్యవసర వైద్యం అవసరం కావడంతో వారికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో కొంచాడ సురేష్ కుమార్, బొడ్డాపు చిన్నారావు (మేనేజర్), రాపాక తిరుపతిరావు(ఏరియా మేనేజర్), పులారి మోహనరావు, ముడిమించి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం

**-పీఎం సూర్య ఘర్ మిషన్ మోడ్ లో చేపట్టాలి**

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ లి**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి సూర్య ఘర్, ఐసిడిఎస్, జిఎస్డబ్ల్యుఎస్, పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్యం, పిజిఆర్ఎస్ వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సవరించిన విచారణ నివేదిక, ఎండార్స్‌మెంట్ ప్రొఫార్మాలను పరిశీలించారు. పరిష్కరించబడిన ఫిర్యాదులపై ఆడిటింగ్ నిర్వహించాలని, ఏపీ సేవ, మీసేవా, పిజిఆర్ఎస్ దరఖాస్తుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సాంకేతికతను ఉపయోగించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను మిషన్ మోడ్ లో చేపట్టాలని ఎంపీడిఓలు, విద్యుత్ శాఖ ఏఈలకు సూచించారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే, ఫిర్యాదులను పరిష్కరించడానికి అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. ఐ వి ఆర్ ఎస్ కాల్‌ల విశ్లేషణ, గృహ స్థలాల రీ వెరిఫికేషన్, అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, ఎస్సీఎస్టీ కేసుల పరిష్కారం లపై అంశాల వారిగా మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏఈలు, డీఈల స్థాయిలో పల్లె పండుగ పనుల స్థితి, గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఇప్పుడు పురోగతిలో ఉన్న పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయడం పై చర్చించారు. ఐసిడిఎస్ లో మరుగుదొడ్లు, విద్యుత్, నీటి సరఫరా స్థితిపై సమీక్షించారు. గ్రామ సచివాలయాలకు సంబంధించి గత సమావేశంలో చర్చించిన హాజరు, ఇతర సర్వేల స్థితిపై అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యంపై సమీక్షలో భాగంగా చెత్త నుంచి సంపద సృష్టి ప్లాంట్ల గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్య ప్రణాళికా అధికారి కార్యాలయం పరిధిలో ముఖ్యమంత్రి హామీలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, డిఆర్డిఏ పీడి కిరణ్ కుమార్, హౌసింగ్ పీడి నగేష్, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్ తదితరులు హాజరయ్యారు.

## శివరాత్రికి ముస్తాబైన ఆనందగిరి మెట్ట



**మందస, ఫిబ్రవరి 25(వార్త):** మందస శివార్లో గల ఆనందగిరి మెట్ట మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యింది. మెట్ట మీద గంగాధర గరుఢ గోవిందాలయాన్ని మందస సంస్థానాధీశులు నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న ఈ ఆలయాన్ని భక్తులు, దాతలు సహకారంతో పునఃనిర్మించారు. గంగాధరుని దర్శించుకోవడానికి శివరాత్రి భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారు. దీంతో నిర్వాహకులు ప్రతీ ఏటా తీర్థ, ప్రసాదాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిథులు ఆలయాన్ని, పరిసరాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



# అభివృద్ధి పేరుతో పేదల ఇళ్ల కూల్చివేత తగదు

**-సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ**

**పలాస, ఫిబ్రవరి 25(వార్త):** కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేదల ఇల్లు దోచుకుంటున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. మంగళవారం సూది కొండ ప్రాంతంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలాస మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సూది కొండ ప్రాంతంలో దాదాపు 9 ఎకరాల భూమిలో పేద,మధ్యతరగతి ప్రజలు 40 ఇల్లు కట్టుకుని జీవనాన్ని సాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలో సెంట్రల్ స్కూల్ మంజూరు చేయబడిందని వారం రోజులు ముందు నోటీసులు తయారుచేసి బుల్డోజర్ సహాయంతో ఇల్లును కూల్చి నేలమట్టం చేశారని అన్నారు. కనీసం ప్రజలతో సంప్రదించకుండా, వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా ప్రభుత్వం ఈ విధంగా చేయడం సమంజసం కాదని, ఇల్లు కూల్చిన పేద,మధ్యతరగతి ప్రజలు రోడ్డు మీద పడిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ ప్రాంతం డి పట్టా భూమిని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వం అంటే ప్రజలు అని, ప్రజలు ఓట్లు ద్వారా ఈరోజు అధికారం సంపాదించుకున్నారని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అనేక అవస్థలను తీసుకురావడం ప్రభుత్వానికి సరికాదని , గత 40 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఉంటున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు , స్థానిక ఎమ్మెల్యే ప్రజలను కూర్చోబెట్టి మాట్లాడాలని, అదేవిధంగా మీరు సెంట్రల్ స్కూల్ తెచ్చి అభివృద్ధి చేస్తారంటే భారత కమ్యూనిస్టు పార్టీగా మేము స్వాగతిస్తున్నామని, పేద ప్రజలు నివాసం ఉంటున్న భూములే మీకు అవసరమయ్యాయా అని దుయ్యబట్టారు. గతంలో చూస్తే అంతకుముందున్న వైసీపీ పార్టీ, ఇప్పుడున్న తెలుగుదేశం పార్టీ ల బడా బాబులు చేతులలోకి పోకుండా పేద ప్రజల నివసిస్తున్న స్థలాల వద్దకు వచ్చి బుల్డోజర్ రాజకీయాలు చేస్తే సహించేది లేదని, స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీ నుంచి రాగానే ప్రజలతో సంప్రదించి ఈ స్థలం పరిశీలన చేసి పేద ప్రజలు నివసిస్తున్న స్థలంలో సెంట్రల్ స్కూల్ పెట్టినట్లయితే ప్రత్యామ్నాయంగా ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు నష్ట పరిహారం అదేవిధంగా ఇంటి స్థలాలు ఏర్పాటు చేసి ఇల్లు నిర్మించి వారికి ఇవ్వాలని లేనిపక్షంలో ప్రజలతో దశల వారి పోరాటాన్ని నిర్వహిస్తామని అన్నారు. పై సమస్యపై ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని వారికి అండగా నిలవాలని లేనిపక్షంలో



భవిష్యత్ పోరాటాలను మీరు చవిచూస్తారని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వారి ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని లేదా ప్రత్యామ్నాయ స్థలాలైనా ఇవ్వాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వారికి అండగా నిలిచి ఈ స్థలంలోనే పేదలకు అండగా ఇల్లు నిర్మాణం చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సిహెచ్ . వేణుగోపాల్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గోపి, కుమార్, బాధితులు దాసరి రాజు, సంధ్య, రమ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సంగమేశ్వరునికి పటిష్ట బందోబస్తు



**వంగర, ఫిబ్రవరి 25(వార్త):** సంగాం సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై మంగళవారం పోలీస్ బందోబస్తుకు డీఎస్పీ రాఘవులు, రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర రావు లు ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు, దీనిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విధుల్లో ఉన్న పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టాలి ఏ విధంగా భక్తులకు ఏర్పాట్లు చేయాలన్న వాటిపై వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వంగర ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్జీయూకేటీలో వైద్య శిబిరం విజయవంతం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్-2లో మంగళవారం సహాయ మిత్ర సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరం ఆర్జీయూకేటీ డైరెక్టర్ బాలాజీ, ఏఓ రామకృష్ణ, ఎఫ్ఓ వాసు, డీన్ అకడెమిక్స్ మోహన్ కృష్ణ చౌదరి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ రవి గేదెల, క్యాంపస్2 ఇన్‌చార్జ్ సాగర్ సహకారంతో నిర్వహించబడింది. మెడికవర్, జెమ్స్ హాస్పిటల్స్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌తో కలిసి ఈ శిబిరాన్ని నిర్వహించగా, 300 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. చర్మ సంబంధిత సమస్యలు, సాధారణ ఆరోగ్య సమస్యలు, కంటి సమస్యలకు చికిత్సలను వైద్యులు అందించారు.

## తపాలా సేవలపై 6న ఫిర్యాదుల స్వీకరణ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** తపాలా సేవలకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులను మార్చి 6న విజయవాడ, సర్కిల్ ఆఫీస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ నీలంరాజు రంగారావు స్వీకరిస్తారని పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు తెలిపారు. ఫిర్యాదులను చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ-520013 వారి కార్యాలయంకు పోస్ట్ ద్వారా ఈ నెల 28నాటికి చేరేలా పంపించాలని సూచించారు. పోస్ట్ కవర్ పై "డాక్ అదాలత్" అని పెద్ద అక్షరాలతో రాయాలన్నారు. డాక్ అదాలత్ నందు గూగుల్ లింక్ https://meet.google.com /wsw-jeqa-jyi ద్వారా 6వ తేదీ ఉదయం 11 గంటల నుంచి వర్చువల్‌గా కూడా పాల్గొనవచ్చును. ఈ అదాలత్‌లో ఫిర్యాదును పరిశీలించిన తర్వాత ఫిర్యాదుదారునికి ఫిర్యాదు/ఆర్జీ పరిష్కారం లెటరు / ఇమెయిల్ ద్వారా తెలియజేస్తామని తెలిపారు.



## మూడు రోజులు మద్యం దుకాణాల బంద్

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 25(వార్త):** స్థానిక ప్రొహిబిసన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు రోజులు పాటు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు సి ఐ పి.దుర్గా ప్రసాద్ చెప్పారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మూసి వేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 27 న పోలింగ్ ముగిసిన తర్వాత తెరుస్తామని చెప్పారు.

## ఆదిత్యునికి జనరేటర్ విరాళం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామికి శ్రీకాకుళం వాస్తవ్యులు షణ్ముఖరావు రూ.1,30,000ల విలువగల జనరేటర్ ఆలయ ఈవోకి అందజేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 25(వార్త):** జేసీఐ నెల్లూరు టౌన్ కు సంబంధించి చైతన్య అనే వ్యక్తి పర్యావరణ పరిరక్షణకై గో గ్రీన్ అనే సిద్ధాంతం తో చెట్లు యొక్క గొప్పతనాన్ని వాటి యొక్క ఆవశ్యకతని అందరికీ తెలియజేయాలని ఈ నెల 9న నెల్లూరు టౌన్ నుంచి మొదలయి దారి పొడవునా జేసీఐ సభ్యులకు కలిసి వారితో పాటు స్థానికంగా ఉన్న ప్రజల సహాయంతో మొక్కలు నాటుతూ వచ్చి ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఇచ్ఛాపురం జేసీఐ సభ్యులు చైతన్య ని ఘనంగా ఆహ్వానించి, సత్కరించి, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేసారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్‌రావుకి, సిబ్బందికి, జేసీఐ సభ్యులకు, జేసీఐ ప్రెసిడెంట్ కాళ్ళ జైదేవ్, ప్రాజెక్ట్ చైర్మన్ సంతోష్‌సాహుకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జేసీఐ సభ్యులు డాక్టర్ మోహన్ వెంకటేష్, షణ్ముఖరావు, స్వరూప్, రాజ్ కమల్, ప్రేమ్ సాయి, మల్లేష్, డాక్టర్.మట్టా శ్రీనివాస్, అనిత్ తదితరులు పాల్గొన్నారు.



## శివరాత్రి ఉత్సవాలకు కోటేశ్వరాలయంలో ముమ్మర ఏర్పాట్లు




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** శ్రీకాకుళంలో సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన శ్రీ ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. నాగావళి నది ఒడ్డున ఉన్న శ్రీ ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం మూడు గంటలకు ప్రధానార్చన సహిత పంచామృతాభిషేకం, నాలుగు గంటల నుంచి భక్తుల కోసం అభిషేకం, అర్చన, దర్శనములు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి శర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఉమారుద్ర కోటేశ్వరస్వామి వారికి ఆరవెల్లి హరగోపాలశర్మ నేతృత్వంలో ఆలయ అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖర్ శర్మ ఇతర రుత్విజులతో మహాన్యాస పూర్వక ఏకాదశ మహా రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన లింగోద్భవ కాలమునందు జరుపబడుతుందని చెప్పారు. తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారిని మేళతాళాలతో మహానందీశ్వర వాహనంపై శ్రీకాకుళం పురవీధుల్లో తిరువేది ఉత్సవం జరుగుతుందన్నారు. ఈ తిరువీధి ఉత్సవంలో స్వామివారిని సప్త వాహనంపై ఊరేగించడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి రోజున స్వామి వారిని దర్శించుకుని పునీతులు కావాలని భక్తులకు ఆయన పిలుపునిచ్చారు. దేవదాయ, ధర్మదాయ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా సకల ఏర్పాట్లు పూర్తి చేశారు.

## రఘువర్మను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించండి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** కూటమి బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకులు పీఎంజె బాబు ఉపాధ్యాయులను, అధ్యాపకులను కోరారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థికి వేసి గెలపించాలని అభ్యర్థించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు అనే అవస్థలు పడ్డారని, విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని తెలిపారు. ఉపాధ్యాయులను వైన్ షాపుల్లో ఉంచి పనులు చేయించిన దౌర్భాగ్య పరిస్థితులు వైసీపీ ప్రభుత్వంలో చూశామని, దేశంలో ఎక్కడా ఇటువంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సత్తా చూపించి కూటమి ప్రభుత్వాన్ని అత్యధిక స్థానాల్లో గెలిపించారని తెలిపారు. వారి ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం అందిస్తూ , ఫీజురీఎంబార్స్‌మెంట్‌ను విడుదల చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టారన్నారు. జిల్లాలో 5035 మంది ఓటర్లు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొంటున్నారని వారంతా 7వ నెంబరు కూటమి అభ్యర్థికి వేటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నిరంతరం ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం సాగించే రఘువర్మను గెలిపించాల్సిన బాధ్యత ఓటర్లందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, ఇప్పిలి తిరుమలరావు, రెడ్డి గిరిజాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం, ఇచ్ఛాపురం పరిధిలో డ్రోన్ నిఘా

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** శ్రీకాకుళం టౌన్, ఇచ్ఛాపురం టౌన్ పరిధిలో ప్రత్యేక కార్యచరణ తో అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్టు వేసేందుకు విస్తృతంగా డ్రోన్ నిఘా పెట్టడం జరుగుతుంది. జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మంగళవారం శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గల శాంతినగర్ , బైరీవని పేట,బలగ నాగావళి నది పరివాహక ప్రాంతాలు, అదేవిధంగా ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈదుపురం, పురుషోత్తపురం, బహుధా నది పరివాహక, పట్టణ చివర ప్రాంతాలలో నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా పెట్టి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా అపెట్టడం జరిగింది. బహిరంగంగా మద్యం సేవించడం ,గంజాయి సేవించడం, పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్ తడితర నేరాలు పై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టీ పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలు పై డ్రోన్ కెమెరాల నిఘాతో బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.



## ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు

**పలాస, ఫిబ్రవరి 25(వార్త):** ప్రణాళికాబద్దంగా విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చునని ప్రధానోపాధ్యాయుడు ఎస్ వి రమణారావు అన్నారు. పలాస మండలంలోని, బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జీవితంలో ఎదైనా సాధించాలంటే పక్కా ప్రణాళికకు నిరంతర శ్రమ అవసరమని, ఒక్కొక్కరిలో ఒక్కో టాలెంట్ ఉంటుందని దాన్ని తెలుసుకోగలిగితే ఆయా రంగాల్లో మీరే గొప్ప వ్యక్తులు కాగలరని ఎవరూ మిమ్మల్ని మీరు తక్కువుగా అంచనావేసుకోవద్దని తెలిపారు. ఉత్తమ ఫలితాలతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఈశ్వర రావు, మధుబాబు, రమేష్, కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధన రావు, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, యామిని,



మెహర్ సుధా, కిషోర్, రజని కుమారి, జ్యోతమ్మ, అరుణకుమారి, క్రిష్ణవేణి, చిన్నారావు, లక్ష్మి భాయి, విష్ణాచారి, మధుసూదన్, రవితేజ, కోటేశ్వరరావు, తులసీరాణి పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## విజయగౌరి గెలుపు..విద్యారంగ విజయం



**వంగర, ఫిబ్రవరి 25(వార్త):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు పిలుపునిచ్చారు. అరసాడ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసేటటువంటి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలిలో మన గొంతుకు వినిపించేలా చేయాలన్నారు. కార్యక్రమంలో %ఖుఖీ% నాయకులు పల్ల మురళి, వారాడ సత్యం నాయుడు, దన్నాన రామారావు, ఎద్దు మురళి, మురకాల సింహాచలం, పాతిన కృష్ణారావు ,కె తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

# సంగమేశ్వరాలయంలో నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



**వంగర, ఫిబ్రవరి 25(వార్త):** రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన దేవాలయాల్లో ఒకటైన సంగాం సంగమేశ్వర స్వామి ఆలయం వద్దను నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ద్వాపరయుగంలో సాక్షాత్తూ బలరాముడుతో త్రివేణి సంగమం వద్ద సంగాం గ్రామంలో సంగమేశ్వర ఆలయం నిర్మించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. ఆలయ ప్రాంగణంలో గాలిగోపురం , వివిధ దేవత మూర్తులు గోడపై ఉన్న విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నాగవల్లి నధీతీరంలో బలరాముడు ఒక్కరోజే తన స్వహస్తాలతో నాగలతో నదిలో దున్నుకుంటూ పంచలింగాలను స్థాపించినట్లు చరిత్ర చెబుతోంది. మొదటిది మన్యం జిల్లా గుంపు గ్రామం దగ్గర శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం, రెండవది విజయనగరం జిల్లా, వంగర మండలం, సంగం గ్రామంలో త్రివేణి సంగమం వద్ద, శ్రీ. సంగమేశ్వర స్వామి ఆలయం. మూడవది శ్రీకాకుళంలో పాత బ్రిడ్జి వద్ద శ్రీ ఉమా రుద్ర కోటీశ్వర స్వామి వారి ఆలయం. నాలుగువాది శ్రీకాకుళం జిల్లా కల్లేపల్లి వద్ద, శ్రీ మల్లీ నాగేశ్వర స్వామి వారి ఆలయం, ఒరిస్సా రాష్ట్రంలో, రాయగడ పాయికపాడు వద్ద , శ్రీ పాతాళేశ్వర స్వామి ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. భక్తులు పరమేశ్వరుని దర్శించుటకు ముఖ్యమైన పవిత్ర పర్వదినాలైన కార్తీకమాసంలో నాలుగు సోమవారాలతో పాటు మహాశివరాత్రి ధనుర్మాసంలో భాగంగా శ్రీ సంగమేశ్వర స్వామినీ



దర్శించుటకు భక్తులు వివిధ రాష్ట్రాల నుండి చుట్టుప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో దర్శించుకునుటకు వేలల్లో భక్తులు వస్తుంటారు. స్వామివారిని దర్శించుకునుటకు వచ్చిన భక్తులు టిక్కెట్లు విరాళాలు రూపంలో స్వామి వారికే లక్షల్లో ఆదాయం వస్తుంది.



## సంగమేశ్వరునికి ఏసీ శిరీష పూజలు

**వంగర, ఫిబ్రవరి 25(వార్త):** పవిత్ర పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వర స్వామి వారిని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష మంగళవారం నాడు సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ బోను ఆనంద రావు, పి.శ్యామలరావు ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావుతో మాట్లాడారు. శివరాత్రి మహెూత్సవాలు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల వివరించారు. ఆలయం వద్దను ఎలాంటి చర్యలు చేపట్టాలి, వచ్చిపోయే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై ఆమె వారికి ఆదేశాలు జారీ చేశారు. భక్తులు ప్రశాంతంగా పూజలు నిర్వహించి శివుని ఆశీస్సులను అన్ని విధాల పొందేలా చర్యలు చేపట్టాలని వారికి సూచించారు.

## రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకి ముగ్గురి ఎంపిక




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** శ్రీకాకుళంలోని టౌన్‌హాల్ వేదికగా మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ సబ్ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరచిన ముగ్గురు ఫెన్సింగ్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకి ఎంపికైనట్లుగా జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా తెలిపారు. అండర్ 14 విభాగంలో బాలురుకి సంబందించి ఇప్పి కేటగిరిలో శాలిహుండం విశ్వాస్,ఫోయిల్ కేటగిరిలో గొండు అభిరామ్‌లు, బాలికలకి సంబందించి ఫోయిల్ కేటగిరిలో బరాటం వేన్షిత ఎంపికైనట్లుగా పేర్కొన్నారు. మార్చి 1,2 తేదిలలో కృష్ణా జిల్లా కంచికచర్ల ఏక్తా స్కూల్ నందు జరుగబోయే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఫెన్సింగ్ పోటీల జిల్లా నుంచి ఎంపికైన ఈ ముగ్గురు క్రీడాకారులు పాల్గొనున్నట్లుగా తెలియజేసారు. ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక ఎన్ ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ ఆద్వర్యంలో జరిగిందని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనబోయే జట్టుకి కోచ్ గా జి.రాహుల్ వ్యవహరించనున్నట్లుగా జిల్లా అధ్యక్షుడు రాజా పేర్కొన్నారు.

# విద్యా వ్యవస్థకు పునాది పూర్వ ప్రాథమిక స్థాయి



**వంగర, ఫిబ్రవరి 25(వార్త):** విద్యా వ్యవస్థకు పునాది పూర్వ ప్రాథమిక స్థాయి (అంగన్వాడి వ్యవస్థ) అని వంగర మండల విద్యాశాఖ అధికారి-1. పి. ప్రవీణ్ కుమార్ అన్నారు. వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 రోజులపాటు ఏర్పాటుచేసిన జ్ఞాన జ్యోతి శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల వికాసానికి పూర్వ ప్రాథమిక స్థాయి (అంగన్వాడి వ్యవస్థ) ఎంత కీలకమైంది అన్నారు. బాల్య ఆరంభ దశలో విద్యార్థులకు ఆటపాటలతో కూడిన సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి టీచర్లు కృషిచేయలని సూచించారు. పిల్లలు భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్వాడి టీచర్లు పాత్ర ప్రముఖమైందనీ స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో నమోదు పెంచే విధంగా అంగన్వాడి టీచర్లు కృషి చేయాలన్నారు. జ్ఞాన జ్యోతి శిక్షణలో నేర్చుకున్న అనేకంశాలు పిల్లలకు మరింతగా తర్ఫీది ఇచ్చే విధంగా అంగన్వాడీ టీచర్లు ప్రణాళిక రూపొందించుకోవాలనీ సూచించారు. ఎంఈఓ- 2 కే. జగదీశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో బాల్య ఆరంభ దశలో పిల్లలకు విద్యను అభ్యసించడానికి అంగన్వాడి టీచర్ల పాత్ర ఎంతో కీలకమైంది అన్నారు. పనే దైవంగా పాటిస్తూ విద్యా వ్యవస్థ అభివృద్ధికి అంగన్వాడి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణకు హాజరైన అంగన్వాడి టీచర్లకు శిక్షణ సర్టిఫికెట్లును ఎంఈఓ లు ప్రవీణ్ కుమార్ జగదీశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వంగర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, వెన్యూ డైరెక్టర్ ముద్దాడ. రమణమ్మ హాజరు కాగా డిఆర్పిలు కే.కిషోర్ కుమార్, బి శ్రీనివాసరావు ఎం లక్ష్మీనారాయణ లు వ్యవహరించారు. ఈ శిక్షణలో అంగన్వాడి సూపర్వైజర్లు జి. రజిని దుర్గ, డి కళ్యాణి, జి అమ్మన్నమ్మలు, అంగన్వాడి టీచర్లు, ఎంఐఎస్ కిరణ్ కుమార్, ఎల్డిఏ.తబిటి నాయుడు, సిఆర్ఎంటిలు వాసు, ఎం గణపతి, ప్రేమ్ కుమార్, అనురాధ, శ్రీను, పారయ్య ఎంఆర్సి సిబ్బంది హాజరయ్యారు.

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 25(వార్త):** స్థానిక బాలికోన్నత పాఠశాలలో అంగన్వాడి టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సమావేశంలో ఆరు రోజులపాటు అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకొని అంగన్వాడీ కేంద్రాలలో బాల బాలికలకు ఆహ్లాదకరమైన విద్యా బోధన అందించాలని సూచించడమైనది. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మెరుగైనటువంటి సులభతర పద్ధతిలో ఆటల పాటలతో విద్యార్థులకు బోధన ఆసక్తికర పరచడం కోసం ఎంతగానో దోహదపడుతుందని ఎంఈఓ లు కురమాన అప్పారావు మరియు ఎస్. విశ్వనాథం లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో ఐసీడీస్ పి ఓ నాగరాణి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో స్వచ్ఛమైన బోధన ఆహ్లాదకరంగా విద్యార్థులకు అందించి ప్రతి ఒక్కరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించే దిశగా కృషి చేయాలని అంగన్వాడీ టీచర్లకు కోరారు. ఈ కార్యక్రమానికి ఆర్పీలుగా కే సాయిరాం, ప్రకాష్ రెడ్డి , అప్పన్న వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి రమణమ్మ వసతి అందించినందుకు మండల విద్యాశాఖ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు ఎంఆర్సి సిబ్బంది సీఆర్పీలు పాల్గొన్నారు.




## అందుబాటులో ఆయుర్వేదిక్ మందులు



**కొత్తూరు, ఫిబ్రవరి 25(వార్త):** కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ప్రత్యేక విభాగంలో రోగులకు ఎల్లవేళలా ఆయుర్వేదిక్ మందులు ఉచితంగా అందుబాటులో ఉంటాయని ఆయుర్వేదిక్ వైద్యురాలు డా.ఎస్. చైతన్య తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆసుపత్రిలో రోగులకు అందు బాటులో ఉంటామన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఖాళీ స్థలాలపై పన్ను వసూలు చేయాలి



**పలాస, ఫిబ్రవరి 25(వార్త):** పలాస మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాలపై టాక్స్ వసూలు చేయవలసిందిగా పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. మంగళవారం రోజువారి పర్యటనలో భాగంగా వివిధ వార్డులలో పర్యటించిరు. కాశీబుగ్గ 17 వ వార్డు సాయికాలనీ లో రోడ్ లు స్వీపింగ్ ప్రక్రియను పరిశీలించి, ఎంపీడీవో ఆఫీస్ రోడ్ తిలక్ నగర్ లో బాబ్ కార్ట్ తో కాలువను శుభ్రపరిచారు. కాశీబుగ్గ పాతబస్ స్టాండ్ లో డంపర్ బిన్ ను కాంపేక్టర్ వెహికల్ తో ఖాళీ చేయించి,21వ వార్డు పోతనపల్లి వారి వీధి లో డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రాసెస్ ను పర్యవేక్షించారు. పలాస 24వ వార్డు పురుషోత్తపురం ముత్యాలమ్మ పార్క్ ఎదురుగా ఉన్న మేజర్ కాలువ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాశీబుగ్గ పాత బస్ స్టాండ్ రోడ్లో గల అన్నా క్యాంటీన్ ను రోజువారి తనిఖీల్లో భాగంగా అల్పాహార ఫుడ్ సమయంలో తనిఖీ చేశారు. ఫుడ్ యొక్క నాణ్యత, రుచి చాలా బాగుందని కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయంలో అడ్మిన్ సెక్రెటరీలు, శానిటేషన్ సెక్రటరీలతో సంయుక్తంగా సమావేశం నిర్వహించి వీధులలోనూ మరియు పరిసర ప్రాంతాలలో ఖాళీ స్థలాలను గుర్తించి వాటిలో ఉన్న జంగల్ ను క్లియరెన్స్ చేయించి ఖాళీ స్థలాల పన్నును వసూలు చేయవలసిందిగా కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఇంకనూ బకాయిలు ఉన్న ఇంటి పన్నులను శత శాతం వసూలు చేయవలసిందిగా కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్లు ఉదయపాత్రో, వెంకటేష్, మధు, సోమేశు పాల్గొన్నారు.

## ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన



**వంగర, ఫిబ్రవరి 25(వార్త):** కె.కొత్తవలస గ్రామంలో మంగళవారం రైతులకు ఎరువుల వాడకంపై వంగర మండల వ్యవసాయ అధికారి టీ.కన్నబాబు ఆధ్వ ర్యంలో భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి సింహాచలం , ఏ ఈ ఓ జగన్నాథ రావు అవగాహన కల్పించారు. జగన్నాథ రావు మాట్లాడుతూ, మట్టి నమూనాలు ఏవిధంగా తీయాలి, భూసార పరీక్షతో కలిగే లాభాలు తెలియ జేశారు. ఈ ఫలితాలు ఆధారంగానే ఎరువులు వినియోగించాలన్నారు. సింహా చలం మాట్లాడుతూ, భూసార పరీక్ష పత్రాలలో నేల స్వభావం, లవణాల సాంద్రత, ఆమ్లక్షార లక్షణం, సేంద్రీయ కర్బనం, లభ్య భాస్వరం, లభ్యా ఫొటాస్ తదితర వివరాలను రైతులకు విడమరచి విపులంగా తెలియజేశారు. భూసారం పెంపొందించేందుకు పచ్చి రొట్ట ఎరువులు ప్రతి ఒక్క రైతు వేసి పొలంలో కలియ దున్నుకోవాలని తద్వారా సేంద్రియ కర్బనం శాతం పెరగడం ద్వారా ఆశించిన దిగుబడి పొందవచ్చునని వ్యవసాయ అధికారి కన్నబాబు తెలియజేశారు. కార్యక్రమంలో విహెచ్ఎ శివసాయి రైతులు గోవిందరావు మహేష్ నీలకంఠం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# నేడు మహాశివరాత్రి

**✳ ముస్తాబైన శైవక్షేత్రాలు ✳ ఆలయాల వద్ద ఏర్పాట్లు చేసిన అధికారులు, నిర్వాహకులు**






**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(వార్త):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలను దేవదాయ శాఖాధికారులు, కమిటీలు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉమా రుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం, రావివలస ఎండలమల్లికార్జునస్వామి, శ్రీముఖలింగంలో మధుకేశవస్వామి ఆలయాల్లో పెద్ద ఎత్తున క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేయనున్నారు. లక్ష బిల్వార్చన, లింగోద్భవం చేయనున్నారు. శ్రీముఖలింగంలో ఆలయ బయట బారికేడ్లు ఏర్పాటు చేశారు. మూడు రోజులు పాటు మహాశివరాత్రి ఉత్సవాలు ఇక్కడ చేయనున్నారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మొబైల్ టాయిలెట్లు సిద్ధం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ నాలుగు బృందాలతో శిబిరాలను ఏర్పాటు చేసింది. చక్రస్నానాలకు వెళ్లే దారిలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. భక్తులు నడిచే దారిని చదును చేసి బ్లీచింగ్ తో శుభ్రం చేశారు. సిసి కెమేరాలు, డ్రోన్లు ఏర్పాటు చేసి క్యూలైన్లు, తదితరమైన వాటిని కంట్రోల్ రూం ద్వారా నిశితంగా పోలీసులు పరిశీలించనున్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎండదెబ్బ తగులకుండా టెంట్లు ఏర్పాట్లు చేశారు. పార్కింగ్, గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అర్చకుల కార్లు..
## ఆలయ ఆవరణలో పార్కింగ్

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 25 (వార్త):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉమా రుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో దేవదాయ శాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఆలయ ఆవరణలోనే అర్చకులకు సంబంధించిన కార్లను పార్కింగ్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో కార్లు పార్కింగ్ చేయడమేమిటని కొందరులు నిలదీస్తున్నారు.







## ప్రైవేట్ బస్సుతో ట్రాఫిక్ జాం

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 25 (వార్త):** నగరంలోని పాలకొండ రోడ్డులో ఓ ప్రైవేట్ బస్సు మంగళవారం మరమ్మతులకు గురైంది. దీంతో ఆ బస్సును రోడ్డుపైనే నిలిపివేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు గంటపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు.

## హత్య వెనుక ఎవరి హస్తం?

**✳ వెనుకుండి నడిపించింది ఎవరు?**
**✳ భార్యపైనే అనుమానం**
**✳ పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్న పోలీసులు**



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 25 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని మజ్జి రమేష్ హత్య, ఆత్మహత్య అన్నది ఇంకా తేలలేదు. పోలీసులు మాత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడనే చెబుతున్నారు. అయితే వారు సైతం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి తలుపులు లోపలి నుంచి గడియ పెట్టడం, పెరటి తలుపులు తీసి ఉండడంతో ఇది ఆత్మహత్య కాదని, హత్యేనని పోలీసులు కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ మృతుడి భార్య శశిని పోలీసులు విచారణ చేపట్టారు. హత్య ఎవరు చేయించారు అన్న దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. కొందరు మృతుడి భార్యపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఆ కుటుంబంలో జరుగుతున్న వివాదాలపై కూడా ఆరా తీసినట్టు తెలిసింది. ఎవరెవెరు ఆ ఇంటికి వచ్చి పోతున్నారు తదితర అంశాలపై పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులను అడిగినట్టు సమాచారం. గతంలో భార్యభర్తల మధ్య గొడవలు జరిగి చివరికి పోలీస్‌స్టేషన్‌కు సైతం చేరింది. మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.

# గంజాయి ముఠా.. ఆటకట్టు

**✳ పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట, ఇచ్ఛాపురంలో గంజాయి బ్యాచ్‌ల అరెస్టు**
**✳ పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం**

**పలాస, ఫిబ్రవరి 25 (వార్త):** జిల్లా పోలీసులు గంజాయి బ్యాచ్‌పై కొరడా ఝుళిపించారు. ఎక్కడికక్కడ దాడులు జరిపి పెద్ద ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. మంగళవారం ఒక్కరోజే పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట, బారువ, ఇచ్ఛాపురం మండలాల్లో పెద్ద ఎత్తున గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..ఒడిశా నుంచి రెండు బైకుల పై గంజాయి బ్యాగులతో పలాస రైల్వే స్టేషన్ కు వెళ్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరు గంజాయి ముఠా సభ్యులను కాశీబుగ్గ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారయ్యాడు. గత కొంత కాలంగా ఒడిశా రాష్ట్రం మోహన గ్రామానికి చెందిన బబుల్లా ఉదయగిరిలో తాను పండించిన గంజాయిని పలాస రైల్వే స్టేషన్ కేంద్రంగా చెన్నై, బెంగుళూరుకు అక్రమంగా రవాణా చేస్తూ అధిక మొత్తంలో డబ్బులు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు మంగళవారం తన ముఠాకు చెందిన లితు రైట్, జిల్లు నరేంద్రతో గంజాయి బ్యాగులను పలాస రైల్వే స్టేషన్‌కు రెండు బైకులపై రవాణా చేస్తుండగా కాశీబుగ్గ సీఐ పి.సూర్యానారాయణ తన బృందంతో పట్టుకున్నారు. 40 కిలోల గంజాయి స్వాధీ నం చేసుకుని రెండు బైకులు, రెండు మొబైళ్లను సీజ్ చేశారు. నిందితులపై ఎన్డీపీఎస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట ప్పారావు తెలిపారు. పరారీలోనున్న నిందితుడు నరేంద్ర ఆచూకీకి గాలింపు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

**వజ్రపుకొత్తూరు:** వజ్రపు కొత్తూరు పోలీసు స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు చోట్ల అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని వజ్రపుకొత్తూరు పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు తెలిపారు. పలాస నుంచి బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన మనన్య సబర్, వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన బైనపల్లి షణ్ముఖ, ప్రశాంత్ మల్లిక్‌ను మంగళవారం అరెస్ట్ చేసి 8.280 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేశారని డీఎస్పీ తెలిపారు. మరో ఘటనలో పూండి స్టేషన్ వద్ద గంజాయి బ్యాగ్ లతో సంచరిస్తున్న ఒడిశాకు చెందిన ప్రశాంత్ కుమార్ సాహు, భారతీ సాహును అరెస్ట్ చేసి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారన్నారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి 18.280 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి పలాస కోర్టుకు తరలించినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్ తదితరులున్నారు.

**సోంపేట:** ముంబాయికి గంజాయి ఎగుమతి చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు చాకచక్యంగా రట్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి... మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటల సమయంలో ఒరిస్సా రాష్ట్రం అస్కాలో కుదలా గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం వద్ద నుండి 3 పాకెట్ల గంజాయిని తీసుకొని, దానిని ముంబాయికి తరలించడానికి కుదలా గ్రామానికే చెందిన పింటూ బాయ్‌కి ఇవ్వడానికి గాను, బరంపురం నుండి సోంపేట వరకు బస్సులో సదరు నిందితులు వచ్చారు. సోంపేట నుండి విశాఖపట్నం వెళ్లేందుకు సోంపేట బస్సు స్టాండ్ నందు వేచి ఉండగా స్థానిక ఎస్.ఐకి సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సిబ్బందితో వెళ్లి నిందితులను పట్టుకున్నారు. అలాగే గంజాయితో ముగ్గురు వ్యక్తులు ఒకే మోటార్ సైకిల్‌పై మూడు బ్యాగులతో బారువలోని 2వ ముద్దాయి ఇంటికి వస్తుండగా, వారు ఉదయం 8:30 గంటలకు పోలీసులకు పట్టుబడ్డారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని కాశీబుగ్గ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అప్పారావు వెల్లడించారు.

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం మండలం, ఎం.తోటూరు గ్రామం ఎల్పి గేటు వద్ద గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులను స్థానిక ఎస్సై, సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుండి సుమారు 10.020 కేజీల గంజాయి, రెండు సెల్ ఫోన్లు ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈమేరకు ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను డీఎస్పీ అప్పారావు మీడియాకు వెల్లడించారు.











# ఆధ్యాత్మిక సిరులు.. మహేంద్రగిరులు

*** మహాశివరాత్రికి ప్రత్యేక యాత్ర * లక్షలాది భక్తులు రాక * ఆంధ్రా, ఒడిశాల నుంచి రహదారి * రెండు కొండల మధ్య కుంతి ఆలయం * 24 బండరాళ్లతో భీముని ఆలయం * శ్రీముఖలింగం ఆలయాన్ని పోలివున్న ధర్మరాజు గుడి * మహేంద్రగిరికి ఆంధ్రా, ఒడిశా నుంచి దారులు**

**మందస, ఫిబ్రవరి 25(వార్త):**హేభిమ్మో... హేభిమ్మో... అంటూ పచ్చని అరణ్యం మధ్య నుంచి భక్తుల జనఘోష వినిపిస్తుంటుంది. ఏడాది పొడవునా నిశ్శబ్ధంగా ఉన్న గిరుల ప్రాంతం అప్పుడప్పుడు క్రూర మృగాల అరుపులు మాత్రం ఆ నిశ్శబ్ధాన్ని భంగపరుస్తుంటాయి. కానీ, కేవలం ఏడాదిలో మూడు రోజులు మాత్రం ఆ ప్రాంతంలో చైతన్యం నిండిపోతుంది. దట్టమైన ఆంధ్రా-ఒడిశా అడవుల మధ్య ఉన్న మహేంద్రగిరికి కొండంత భక్తితో భక్తులు తరలివస్తారు. దక్షిణ భారతదేశంలో తూర్పు కనుమలు అతి ఎత్తైన శిఖిరం మహేంద్రగిరులు. పెద్ద పెద్ద వృక్షాలు... లోతైన లోయలు... అమూల్య ఔషధ మూలికలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. వీటి మధ్యలో అతి ఎత్తైన పర్వతాలే మహేంద్రగిరులు. ప్రకతి సౌందర్యమే కాకుండా, ఆధ్యాత్మిక వైభవాన్ని కలిగిన ఈ మహేంద్రగిరులు తూర్పు కనుమల్లోని గంజాం జిల్లా ఒడిశా-ఆంధ్రా సరిహద్దులో విస్తరించి ఉన్నాయి. సముద్రానికి సుమారు 5వేల అడుగుల ఎత్తులో ఉంది. మహాశివరాత్రి సందర్భంగా మహేంద్ర గిరులపై మూడు జరిగే యాత్రకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. శ్రీకాకుళం జిల్లా మందస గ్రామానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. భక్తులు మజిలీ చేసుకుని కేవలం కాలినడకనే భక్తులు కష్టాన్ని భరించి, గిరులపై ఉన్న ఆలయాలను చేరుకుంటారు. సుందరమైన ప్రకృతిని చూసి, తన్మయత్వం చెందుతారు. గల గల పారే సెలయేర్లు... కుహూ కుహూ రాగాలాలిపించే కోయిలలు... వింత ధ్వనుల చేసే పక్షులు... కనుచూపు మేర శోభను చేకూర్చే ఎన్నో రకాల వృక్షాలు... మత్తెక్కించే పూల పరిమళాలు ఆహ్లాదపు అనుభూతినిస్తాయి. మహేంద్రగిరులపై పంచ పాండవులు నిర్మించారని పురాణాలు చెబుతున్న ఆలయాలున్నాయి. అతి ఎత్తైన ఈ కొండలపై పెద్ద, పెద్ద రాతి పలకలతో నిర్మించి, ఆలయాలను చూస్తే, వీటి నిర్మాణం చూస్తే కష్టసాధ్యమనిపిస్తుంది. రవాణా సౌకర్యంలేని ఎత్తైన ఈ కొండపైకి పెద్ద పెద్ద రాళ్లు ఎలా తరలించారో... ఎందరు శిల్పులు శ్రమించారో ఊహించడం కష్టం. అందువల్లనే ఈ ఆలయాలను పాండవులు నిర్మించారంటే విశ్వసించకతప్పదు. భక్తులు ముందుగా చేరుకునే కుంతీదేవి ఆలయం. రెండు కొండల మధ్య ఉంటుంది. ముఖద్వారం పశ్చిమ దిశగా ఉంది. దక్షిణ భాగాన విఘ్నేశ్వరుడు, తూర్పున కుమారస్వామి, ఉత్తరాన పార్వతీదేవి విగ్రహాలు ఆలయం వెలుపల ఉంటాయి. ఎదురుగా ఒక మంచినీటి బావి ఉంది. లక్షలాది యాత్రికులకు నీరు అందిస్తుంది. కుంతీదేవి ఆలయానికి దగ్గరలో విశాలమైన ప్రదేశం ఉంది. ఈ భాగమంతా రాతితో కప్పబడి ఉంది. అక్కడే ధర్మరాజు ఆలయం ఉంది. పశ్చిమ దిశగా ఆలయం ఉండగా, కుంతీ ఆలయానికి ఈ ఆలయం పెద్దదిగా ఉంది. ధర్మరాజు ఆలయం భూమిలోకి కొంతభాగం దిగినట్టుగా ఉంటుంది. భక్తులు మెట్లను దిగి, వెడల్పుగా పొట్టిగా ఉన్న లింగాన్ని దర్శించుకుంటారు. మెట్లు మాదిరిగా రాతి పలకాలతో నిర్మించబడి ఉంది. కుడిపక్కగా ఓ చిన్న ఆలయం ఉంది. పురిగుడిసెలా ఉన్న ఈ ఆలయాన్ని సహదేవుని ఆలయంగా చెబుతారు. ముఖద్వారం తూర్పు దిశగా ఉంటుంది. ఎదురుగా కొద్దిదూరంలో సహదేవుని ఆలయం మాదిరిగానే నకుల, ద్రౌపది ఆలయాలుంటాయి. ధర్మరాజు ఆలయానికి ఎదురుగా పశ్చిమదిశ వైపు నాలుగు కొండ శిఖరాలున్నాయి. వీటిలో మధ్య రెండు శిఖరాలపై భీమార్జున ఆలయాలున్నాయి. భీముని కోవెల కుంతీ, ధర్మరాజుల ఆలయాల కంటే చిన్నదిగా ఉంది. విశేషమేమిటంటే రెండింటి నిర్మాణం కంటే భిన్నంగా ఉంటుంది. 5 పెద్దరాళ్లతో పాటు మొత్తం 24 రాళ్లతో ఆలయ నిర్మించారు. కానీ, మూడు రాళ్ల మధ్య పగులు ఏర్పడగా, నాలగవది ఒకే రాయి కాగా పైన ఉన్న రాయి గుండ్రంగా చెక్కి ఉంటుంది. తూర్పునకు ముఖద్వారం ఉండగా, పశ్చిమ వైపు చిన్న ఇరుకు నిష్క్రమణ ద్వారం ఉంది. ఇరుకుగా ఉన్నప్పటికీ భక్తులు వెలుపలకు రావడం ప్రత్యేకత. కొంతమంది భక్తులను పోలీసుల బయటకు లాగుతుంటారు. క్రూర మృగాలు తిరుగుతున్న మహేంద్రగిరుల అరణ్యంలో భక్తులకు ఎటువంటి హాని చేయకపోవడం విశేషం. అంతేకాదు, అవి ఎవరికి కనబడకపోవడం ఆశ్చర్యకరం. భీముని ఆలయం నుంచి కిందకు చూస్తే, నాగావళి, వంశధార, బహుదా చిన్న పిల్లకాలువల్లా బంగాళాఖాతం సముద్రంలో కలవడం కనిపిస్తుంది. సముద్రం వెండి జరీచీరలా ఉంటుంది. చీకటి పడితే పట్టణాల్లో గల విద్యుత్ దీపాలు మిణుగురు పురుగుల్లా కనిపిస్తాయి. అదోక విచిత్రానుభూతిగా భక్తులు చెబుతారు. భీముని ఆలయానికి







కుడివైపుగా మరో శిఖరం ఉంది. అక్కడ అర్జునుని ఆలయం లేనప్పటికీ, ఆధారాలున్నాయి. శబ్దభేరిని అనగా వస్తువు కనిపించకపోయి, అస్త్రప్రయోగం చేసిన స్థలంగా చెబుతారు. పక్కనే చిందరవందరగా పెద్దపెద్ద బండరాళ్లు ఉన్నాయి. భక్తులు ఇందులో నుంచి వెళ్లి, బయటకు వస్తారు. పాండవులు లింగ ప్రతిష్ట అనంతరం వారు ఈ మార్గం గుండా వెళ్లారని పురాణ కథనం. దీనినే సొరంగమార్గం అంటారు.



## చారిత్రకుల విశ్లేషణ

వెలకట్టలేని విలువ పుట్ట పురాతన గుట్టలు కట్టడాల వంటి ఆధారాలు ఇప్పటికీ నిక్షిప్తంగా దాగి ఉండి, మనల్ని ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయంటే, శిల్పకారుల చేయి చలువే. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా, వారు నిర్మించిన ఈ ఆలయాలు నేటికీ సజీవంగా విచ్చుకుని, పరిమళిస్తున్నాయి. చరిత్రకు ఆధారాలుగా నిలిచాయి. దేవాలయాలు ఒకే కాలంలో ఒకే రాజుకట్టినవి కాదని, మూడు రాజు వంశాలు కట్టినవి చరిత్రకారుల అభిప్రాయం. హస్తివర్మ, ఉర్లాం శాసనంలో క్రీస్తు శకం 577 గోకర్ణేశ్వరస్వామి గురించి రాశారు. ఈ శాసనాల ఆధారంగా ఈ క్షేత్రం 6వ శతాబ్ధానికే ముందే వెలుగులోకి వచ్చిందని పూర్వీకులు చెబుతున్నారు. మహేంద్రగిరులపై ఉన్న ధర్మరాజు గుడి నిర్మాణ శైలికి, శ్రీముఖలింగం ఆలయాలకు పోలికలు ఎక్కువగా ఉన్నందున ధర్మరాజు ఆలయానికి క్రీస్తు శకం 8వ శతాబ్దంలోనే గంగ వంశపు రాజులే నిర్మించివుండవచ్చు. మూడేసి రాళ్లు చెక్కి, పేర్చి సున్నం లేకుండ నిర్మాణశైలి క్రీ.శ. 10-12 శతాబ్దాల మధ్య తూర్పు చాళుక్యుల కాలంలో ప్రసిద్ధి పొందింది. మహేంద్రగిరిపై ఉన్న భీమాలయం చాళుక్యులు నిర్మించిన బిక్కవోలు ఆలయాలను పోలి ఉండడంతో భీమాలయం చాళుక్యులు నిర్మించారని నమ్మకం. క్రీస్తు శకం 1455లో కటకం పాలించిన గజపతుల కాలంలో ఉత్కళ శిల్ప శైలి అభివృద్ధి చెందింది. పొత్తేశ్వర ఆలయం వీరు నిర్మించినట్టు శిలాశాసనం ద్వారా వెల్లడవుతోంది. కుంతీ ఆలయం కూడా వద్ర శిల్పాన్ని పోలి ఉండడంతో ఈ ఆలయాన్ని కూడా గజపతులే నిర్మించారని భావిస్తున్నారు. ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉన్న మహేంద్రగిరులపై మరిన్ని పరిశోధనలు జరిపితే, ఎన్నో చారిత్రాత్మక రహస్యాలు వెలుగులోకి వస్తాయి.

## మహేంద్రగిరులకు వెళ్లడానికి దారి ఇదే

శ్రీకాకుళం జిల్లాలోని పలాస రైల్వే స్టేషన్లో దిగాలి. అక్కడి నుంచి మందస మీదుగా సాబకోట వరకు పలాస డిపో యాజమాన్యం బస్సులు నడుపుతుంది. సాబకోట నుంచి మహేంద్రగిరులకు కాలినడకను మాత్రమే వెళ్లగలరు. రాజులు బస చేసే ప్రాంతాన్ని రాజబసగా పిలుస్తారు. రాజబస వరకు ద్విచక్ర వాహనాలు, జీపులు, ట్రక్కర్లు కష్టమ్మీద వెళ్తాయి. కాగా, ఒడిశాలోని కొయిపూర్ మీదుగా గిరులపైకి దారిని ప్రభుత్వం నిర్మించింది. ఒడిశా ప్రభుత్వం మహేంద్రగిరులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతోంది. ఆంధ్రా నుంచి కూడా తారురోడ్డు నిర్మిస్తోంది. సాబకోట నుంచి చొంపాపురం మీదుగా.. ఒడిశా సరిహద్దు నుంచి మహేంద్రగిరులను చేరుకోవడానికి వాహనాల రాకపోకలకు ఒడిశా ప్రభుత్వం మంచి రహదారి నిర్మాణం చేపట్టి, పూర్తి చేయడానికి సిద్ధం చేస్తోంది.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546